# చట్టాల్లో మార్పులు! - by SKU

Back Home

ఈ పేజీని పంపండి

కెనడా లో సిక్కులు శాతం చాలా ఎక్కువ. పంజాబ్ లో టెర్రరిజం వున్న రోజుల్లో చాలా మంది భారతదేశం నుండి ఇక్కడకి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. వాళ్ళు ఇప్పుడు ఇక్కడ ఇప్పుడు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకుని, ఒక బలమైన వర్గం గా ఎదిగారు. దానితో వాళ్ళకి తమ స్వతం కోరికలూ, మత సంబంధమైన విషయాలలో ఇక్కడ కెనడా లో కొన్ని సదుపాయాలు సంపాదించుకొనే స్థాయి లోకి వచ్చారు.

సిక్కులు సాధారణం గా తల పాగా కట్టుకోవాలి. ఇక్కడకి వచ్చి స్థిరపడిన చాలా మంది రెండో తరం వారు దానిని పాటించకపోయినప్పటికీ, కొంత మంది ఇంకా తమ మతాచారాలని తు.చ. తప్పక పాటిస్తూ వుంటారు. ఈ పాగా వలన వారికి చాలానే ఇబ్బందులు!

కెనడా లో ఏమిటి, ఏ దేశం లో అయినా ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు కొన్ని నియమ నిబంధనలని పాటించాల్సి వుంటుంది. వాటిలో ముఖ్యమైనది తలకి హెల్మెట్ వాడటం. ఈ చట్టం చేయటానికి కారణం ఏ మతాన్నీ కించపరచటం కాదు. ఆ వాహనచోదకుల భద్రత దృష్టి తో చేసిన ఈ చట్టం తలకి పాగా చుట్టుకునే సిక్ లకి ఇబ్బంది కలిగించటం మొదలెట్టింది. దానితో, వాంకోవర్ లో ఒకాయన కోర్ట్ కి వెళ్ళారు. తన మతాచారం ప్రకారం తను తలకి పాగా చుట్టుకోవాలి. తలకి పాగా చుట్టుకొని, ఆ పైన హెల్మెట్ పెట్టుకోవటం కుదరదు కనుక తనకి హెల్మెట్ లేకుండా వాహనం నడిపే హక్కు ఇవ్వాలని! ఇలాంటి వాదనలు వింటే నాకు చెప్పద్దూ చిర్రెత్తుకొస్తుంది. అంత తన మతం ఆ పని చెయ్యనివ్వకపోతే, వాహనం నడపటం మానెయ్యాలి అంతే కానీ చట్టం లో మార్పు కోరటం ఏమిటీ? అదేమన్నా అన్ని మతాలనీ పరిశీలన లోకి తీసుకొని చేసిన చట్టమా? ఒకో మతం అభ్యంతరం చెప్తుంటే ఒకోళ్ళకీ దానిని సడలించటానికి? లేక ప్రమాదాలు నడిపేవాళ్ళ మతాలని చూసి వస్తాయా?!

అలాగే, పాఠశాలల్లో స్కూలు మొదలయినప్పుడు, కొన్ని చోట్ల స్కూలు అయిపోయాక జాతీయగీతం పాడటం చాలా దేశాల్లో వున్న ఆచారం. అది మన భావితరానికి దేశభక్తి నేర్పించే ఉద్దేశం తో చేసిన చట్టం. అయితే, కొన్ని మతాల ప్రకారం, వారి భగవంతున్ని తప్ప మరి దేనినీ పొగడటం తగని పని. దానితో తమ మతానికి వ్యతిరేకం కనుక, దేశభక్తి గీతమైన జాతీయగీతం తాము పాడమనీ అందుకు అంగీకరించాలనీ చాలా దేశాలలో కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. మా కెనడా కొంచెం ఉదార దేశం కదా, మా దేశం లో అయితే, జాతీయ గీతం పాడక్కర్లేదు. అదే భారతదేశం లో కూడా అనేక కేసులు నడుస్తున్నాయి మన జాతీయ గీతం గురించి!

అంతటి తో అయిపోలేదు. క్రితం వారం కెనడా లో వున్న మరొక చట్టం సిక్ మతానికి వ్యతిరేకం గా అనిపించింది ఒకాయనకి! అది, కొన్ని ప్రమాదకరమైన ఉద్యోగాలలో ఉద్యోగస్తుల భద్రత కోసం కొన్ని చట్టాలు అమలు లో వున్నాయి. వీటి ప్రకారం, భవన నిర్మాణం, చమురు ఉత్పత్తి వంటి కొన్ని రంగాలలో ప్రమదకరమైన పరిస్థితుల్లో పని చేసే వారు తప్పని సరి గా తలకి హెల్మెట్, కాళ్ళకి బూట్లు వగైరా కొన్ని రక్షణ కవచాల వంటివి ధరించాలి. ఇక్కడ మళ్ళీ వచ్చిన చిక్కల్లా తలకి పెట్టుకోవల్సిన ఆ హెల్మెట్ గురించి. తమ మతం ప్రకారం పెట్టుకోవలసిన పాగా కీ, హెల్మెట్ కీ కుదరదు కనుక, తమ మతస్థులు ఆయా రంగాలలో ఉద్యోగాలు చేయటానికి అనర్హులు అవుతారు

కనుక, అసలు ఆ హెల్మెట్ పెట్టుకోవాలనే చట్టాన్నే మార్చాలి అని ఒకాయన కోర్ట్ లో కేస్ వేసారు! మరి రేపు జరగరానిది ఏదన్నా జరిగి ఆయనకి ఏమన్నా ప్రమాదం జరిగితే మరి తనకి ఎటువంటి భరణం వద్దా?! భరణం సంగతి అలా వుంచండి, అతన్నే నమ్ముకున్న అతని కుటుంబం సంగతి?

మతం, కులం అనేవి మన స్వవిషయాలు. వాటిని ఇల్లు దాటి బయటకి వచ్చి, సంఘం లో కలిసేటప్పుడు ఒక పట్టు విడుపు ధోరణి ప్రదర్శించాలి. లేదూ, మతమే తనకి ముఖ్యం అనుకున్నప్పుడు ఆ మతానికి భంగం గా వుండే పరిస్థితుల జోలికి పోకుండా వుండచ్చు కదా? నేను ఒకోసారి అనుకుంటూ వుంటాను, చక్కగా ఇండియా లో వున్న పరిస్థితులు ఇక్కడ కూడా వుంటే, నేను ఏ విధం గా ను సర్దుకోనక్కర్లేదు కదా అని! కానీ ఒక పెద్ద నిర్ణయం తిసేసుకున్నాం. అదే పుట్టి పెరిగిన దేశం కాక మరొక దేశం లో స్థిరపడాలనే నిర్ణయం తీసుకున్నం. మరి అలాంటప్పుడు అక్కడ దేశం లో పరిస్థితులూ, చట్టాలనీ మంకి అణుగుణం గ మార్చుకోవటమా లేక అక్కడి చట్టాన్ని గౌరవించటమా? మనకి అన్నీ మనకి కావలసినట్టు వున్న ఇండియాని వదలి రావాలన్న నిర్ణయం తీసుకున్నాక ఇంక అలా వచ్చి, ఇక్కడ పద్ధతులు మార్చంటే ఎంతవరకూ సబబు? కొన్ని తేలిక విషయాలలో పోనీ అర్థం చేసుకోవచ్చు. కానీ ఇలాంటి జాతీయ గీతం, భద్రత విషయాలలో కూడా నాకు మతమే ముందు వస్తుంది అంటే ఏమో నేను అంతగా సమర్థించలేను.

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.